


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 294, పేజీలు - 08

ఆదివారం, ఏప్రిల్ 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం

**- ఢిల్లీకి వెళ్లి వివిధ పార్టీ నేతలని కలుస్తానన్న కవిత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడంపై కేంద్ర

2లో..

## నమ్మకంతోనే జయం



**- రేవంత్ ను ప్రజలు నమ్ముతారా.?**

**- నిజాలను జనం అంగీకరిస్తారా.?**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్భయంగా నిజాలు చెప్పి మరోసారి గెలిచే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో కొన్నింటిని అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మరికొన్ని వాటిని ఇప్పటి వరకూ అమలు చేయలేదు. ఇందుకు నిధుల కొరత అని ఆయన తరచూ చెబుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తీ కట్టడంతోనే ఆదాయం సగం సరిపోతుందని, మిగిలింది ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకు ఇవ్వాల్సి వస్తుందని చెబుతున్నారు. రేవంత్ రెడ్డి నిజాయితీగానే చెబుతున్నప్పటికీ ఎంత వరకూ జనం నమ్ముతారన్నది ఇప్పుడు చూడాలి.తెలంగాణ ప్రభుత్వ పథకాలు

### అనేక హామీలు ఇచ్చినా

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు అనేక రకాలైన హామీలు ఇస్తుంటాయి. నిజాయితీగా తాము చెప్పిన హామీలు అమలు చేయాలని భావించినప్పటికీ నిధుల సమస్య ఇబ్బంది పడుతుంది. అందులోనూ రేవంత్ సర్కార్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే అదనపు సాయం అంతంత మాత్రమే. అందుకే ఇప్పటి వరకూ కొన్ని హామీలను అమలు చేయలేకపోయారు. అందుకే ఆయన ఈ మధ్య పెళ్లి అయిన మూడు రోజుల్లోనే పిల్లలు పుట్టలేదంటే ఎలా? తొమ్మిది నెలలు వేచి చూడాలి. అన్న కామెంట్స్ చేశారంటే తాను నిజాయితీగానే ఉన్నానని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తానని చెప్పకనే చెప్పినట్లయింది.

### విపక్షాల విమర్శలను పక్కపెట్టి..

విపక్షాల నుంచి అనేక విమర్శలు వస్తున్నప్పటికీ దానిని పెద్దగా పట్టించుకోకుండా తాను అనుకున్న సమయానికే ఇస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి

2లో..

## బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు

**- మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు ఖాయమన్న ప్రధాని**



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్‌లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు.

### - బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం: మోదీ హామీ

ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే, గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు. తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం

2లో..

## తెలంగాణలో ఎస్ఐఆర్ వాయిదా

**- ఐదు రాష్ట్రాల ఎన్నికలే కారణం**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఏప్రిల్‌లో చేపట్టాల్సిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వాయిదా పడింది. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల ఎన్నికలు , జనాభా లెక్కల సేకరణ వంటి కార్యక్రమాల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జూన్‌కు వాయిదా వేసినట్టు తెలిసింది. ప్రతి 25 ఏళ్లకు ఒకసారి ఎస్ఐఆర్ ప్రక్రియను ఈసీ నిర్వహిస్తోంది. చివరగా 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టారు. అప్పటి జాబితా ఆధారంగా 2025 ఓటర్ల లిస్ట్ మ్యాపింగ్ ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. ఇక, దేశవ్యాప్తంగా మూడు దశల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చేపట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. తొలి విడతలో గతేడాది బిహార్‌లో పూర్తిచేశారు. రెండో దశలో బెంగాల్, తమిళనాడు, కేరళ సహా 11 రాష్ట్రాల్లో చేపట్టగా ప్రక్రియ చివర అంకానికి చేరింది.

2లో..

## జీవన్ రెడ్డి నిర్ణయం సరికాదు

**పునరాలోచించుకోవాలి**

**- బీఆర్ఎస్ లో చేరాలనే నిర్ణయాన్ని తప్పుబట్టిన మహేష్ గౌడ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరాలని తీసుకున్న నిర్ణయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ జెండా మోసిన ఆయన, కేవలం స్థానికంగా ఉన్న చిన్నపాటి విభేదాల కారణంగా పార్టీని

2లో..

## కాఫీ విత్ చంద్రబాబు

**- టీడీపీ క్యాడర్ తో చంద్రబాబు కాఫీ కబుర్లు**

**- క్లీన్ పాలిటిక్స్ కు టీడీపీని కేర్ ఆఫ్ అడ్రస్ గా మార్చాలి**

**- క్వాంటం టెక్నాలజీ తో ఏపీని అభివృద్ధి చేస్తామని వెల్లడి**

**- గత ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలను తగ్గిస్తున్నామన్న సీఎం**





అమరావతి (ప్రశ్న న్యూస్) టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం పార్టీ నేతలకు కీలక సూచనలు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల శిక్షణా తరగతులకు హాజరైన ఆయన కాఫీ కబుర్లు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ ఇంఛార్జ్‌లతో భేటీ అయ్యారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం-అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై కార్యకర్తలతో చంద్రబాబు మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు పైనా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను, వైసీపీ దుర్మార్గాల్ని సామాన్య కార్యకర్తలు కూడా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. క్లీన్ పాలిటిక్స్ కు కేరాఫ్ అడ్రస్సుగా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలని సూచించారు. గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరగాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ప్రభుత్వం పడుతున్న

2లో..

## తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్.?

**- ఆయన పేరు ఖరారు అయినట్లేనా!?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర నూతన పోలీస్ బాస్ ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం డీజీపీగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. 1991 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ పేరు యూపీఎస్సీ పంపిన ముగ్గురు పేర్లతో కూడిన ప్యానెల్‌లో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనే పోలీస్ బాధ్యతలు చేపట్టేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. ప్రస్తుత డీజీపీ బి. శివధర్ రెడ్డి పదవీ కాలం ఏప్రిల్

2లో..

## 2029 ఎన్నికల సమరానికి సై అంటున్న జగన్

**- త్రిముఖ వ్యూహం సిద్ధం.. సక్సెస్ అయ్యేనా.?**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది.మరో నాలుగు నెలల్లో రెండేళ్లు పూర్తి చేసుకుని మూడేళ్లలోకి అడుగుపెట్టబోతుంది. అంటే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైం ఉంది. అయితే ఒక ఏడాది గడిస్తే ఇక ఎన్నికల హీట్ మట్నదలవుతుంది.అయితే 2029 ఎన్నికల్లోనైనా గెలుపొందాలని వైసీపీ భావిస్తోంది. ఈ మేరకు ఇప్పటి నుంచే వైసీపీ వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా మూడు అస్త్రాలను ఎన్నికల ప్రచారానికి సిద్ధం చేసుకుంటుందని తెలుస్తోంది. అవి ఏంటో ఓసారి తెలుసుకుందాం.

2లో..

## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

**- రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారన్న కేటీఆర్**

**- పేదల భూములు అరాచకంగా లాక్కుంటున్నారని వ్యాఖ్య**

**- ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో భూ దందాకు తెరలేపారని మండిపాటు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్... ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. మెజారిటీ

2లో..


## అమీన్‌పూర్‌లో హైడ్రా అత్యంత భారీ ఆపరేషన్

**- రూ.15 వేల కోట్ల విలువైన భూమికి రక్షణ**

**- 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం**

**- కబ్జాలకు ఆస్కారం లేకుండా చుట్టూ ఫెన్సింగ్**

**- ముఖీం గెస్టు హౌస్తో పాటు ఫామ్ హౌస్ కూల్చివేత**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా అత్యంత భారీ ఆపరేషన్ చేపట్టింది. శనివారం నాడు హైడ్రా, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా ఆపరేషన్‌లో సుమారు 861 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నాయి. దీని మార్కెట్ విలువ రూ. 15,000 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ

2లో..

## భానుడి భగభగలు

**- పది రోజులు బయటకు రావద్దు**

2లో..



## ప్రపంచ ఉగ్రవాద సూచీలో పాకిస్థాన్‌దే ప్రథమస్థానం

**- గత ఏడాది ఉగ్రవాద దాడుల్లో 1139 మంది మృతి**

2లో..



# 2029 ఎన్నికల సమరానికి సై అంటున్న జగన్

### వైఎస్ జగన్ ఎన్నికల అస్త్రాలు

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్ట బద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆంధ్రప్రద్ రాజధానిగా అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించినట్లు అయ్యింది.అయితే అదే సమయంలోనే వైసీపీ అధినేత వైఎస్ జగన్'మావిగాన్'అంటూ సరికొత్త ప్రతిపాదన తీసుకువచ్చారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు పరిధిలో 110 కిలోమీటర్ల మేర రాజధాని ప్రాంతాన్ని డెవలప్ చేయాలంటూ కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారు. మావిగన్ కోసం అమరావతి కోసం చేసే ఖర్చులో 10 శాతం ఖర్చు పెడితే చాలు అని అన్నారు. అమరావతిని రాజధానిగా వైఎస్ జగన్ అంగీకరిస్తున్నట్లు కనిపించడం లేదు అనే ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే వైసీపీ హయాంలో మూడు రాజధానులంటూ ఎవరూ ఊహించని విధంగా సరికొత్త ప్రతిపాదనలు తీసుకువచ్చిన జగన్ తాజాగా మావిగన్ ప్రతిపాదన తీసుకురావడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

### వ్యూహాత్మకంగానే తెరపైకి మావిగన్

2019 ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కేవలం అమరావతినే కాకుండా మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకువచ్చింది. మూడు రాజధానుల వల్ల మూడు ప్రాంతాల ప్రజలు బ్రహ్మరథం పడతారని దీంతో 2024 ఎన్నికల్లో విజయం తమదేనని వైసీపీ భావించింది. కానీ అది వికటించింది. వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. అమరావతిని రాజధానిగా ప్రకటిస్తామని ఎన్నికల ప్రచారం నిర్వహించిన కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అమరావతిరాజధానిగా చట్టబద్ధత కల్పించింది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల నాటికి పుంజుకోవడం కోసం జగన్ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అమరావతి కారణంగా గుంటూరు, కృష్ణా జిల్లాలు కూటమికి అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో వైసీపీకి ఆదరణ అంతంత మాత్రంగానే ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో జగన్ వ్యూహాత్మంగా మావిగన్ ప్రతిపాదన తీసుకువచ్చారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే మూడేళ్లలో అమరావతిలో ఆశించిన మేర అభివృద్ధి జరగకపోయినా రాజధాని సిద్ధం కాకపోయినా వైఎస్ జగన్ 'మావిగన్'ప్రాంతాన్ని ఎత్తుకునే అవకాశం ఉంది. తాను ప్రతిపాదించినట్లు మావిగన్‌ను రాజధానిగా చేసి ఉంటే బాగుండేది అని వైఎస్ జగన్ ప్రజల వద్దకు వెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలా జరగకపోయినా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి జగన్‌కు మావిగన్ ప్రతిపాదన ఉపయోగపడే అవకాశం లేకపోలేదు అని తెలుస్తోంది.

### కాపు ఓటర్లను ఆకట్టుకునేందుకు బిగ్ స్కెచ్

ఇదిలా ఉంటే వైసీపీ రెండో అంశం కాపు సామాజిక వర్గాన్ని తమవైపునకు తిప్పుకునేందుకు వ్యూహం. అంబటి రాంబాబు అరెస్ట్‌తో కాపులను కూటమి ప్రభుత్వం వేధిస్తోందని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైసీపీ కొంత మేర సక్సెస్ అయ్యింది. అలాగే మాజీమంత్రి పేర్ని నాని కుటుంబాన్ని సైతం కూటమి ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని...కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని కూడా కూటమి ప్రభుత్వం తీవ్రంగా వేధిస్తోంది అని వైసీపీ ప్రజల్లోకి ముఖ్యంగా కాపు సామాజిక వర్గంలోకి వెళ్తోంది. ఇదే సమయంలో కాపు సామాజిక వర్గానికి చెందిన అంబటి రాంబాబు, ముద్రగడ పద్మనాభం, పేర్ని నాని, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్ వంటి వాళ్లను ముందుండి మరీ తీసుకెళ్తోంది.ఈ క్రమంలో వైసీపీలో కాపు సామాజిక వర్గం నేతలే హైలెట్ అవుతున్నారు. ఇదంతా కాపు సామాజిక వర్గం ఓటర్లను తమ పార్టీ వైపు ఆకర్షించుకోవడలో భాగం అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### గెలుపు ఓటములను డిసైడ్ చేసేది కాపులే

ఇకపోతే ఏపీ ఎన్నికల్లో గెలుపోటములను డిసైడ్ చేయడంలో కాపు సామాజికవర్గానిది కీలక పాత్ర అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ కారణంగా వీరు పూర్తిగా కూటమివైపు మొగ్గు చూపారు. దీంతో కూటమి గెలుపు సాధ్యమైంది. అయితే వచ్చే ఎన్నికల నాటికి కాపు సామాజిక వర్గం నేతలను తమవైపునకు తిప్పుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్ జగన్ వ్యూహంలో భాగంగానే ఇటీవలే మాజీమంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి కాపు నేత అయినటువంటి అంబటి రాంబాబును ఇబ్బందిపెడుతున్నారంటూ జగన్ ప్రత్యేకంగా ప్రస్తావించడం అందులో భాగం అని తెలుస్తోంది.కూటమి పాలనలోనే కాపులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాపులంతా ఏకం కావాలని పదే పదే పిలుపునివ్వడం వ్యూహంలో భాగం అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

### క్రైస్తవులను ఆకట్టుకునేందుకు వ్యూహం

మరోవైపు వైసీపీ మూడో అస్త్రం క్రైస్తవులను తమ పార్టీ వైపునకు తిప్పుకోవడం. క్రైస్తవులు వైసీపీకి ఫేవర్ అన్న విషయం తెలిసిందే. అయితే వచ్చే ఎన్నికల్లో క్రైస్తవులు మాత్రం మట్నత్తం వైసీపీ వైపే ఉండాలనే యోచనలో భాగంగా వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని తెలుస్తోంది. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై ఇప్పటికీ క్రైస్తవుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి.

ప్రవీణ్ పగడాల మరణం కుట్రేనని ఇప్పటికీ మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ లాంటి నేతలు ఆరోపిస్తున్నారు. టీడీపీ బీజేపీతో పొత్తులో ఉండటం, పవన్ కళ్యాణ్ సనాతన వాదాన్ని ఎత్తుకోవడంతో క్రైస్తవులు తమవైపు మొగ్గు చూపుతారనే అంచనాలో వైసీపీ భావిస్తోంది. ఇటీవల ఆకివీడులో జరిగిన ఘర్షణ వాతావరణంపై కూడా వైసీపీ ఫోకస్ పెట్టింది. ఆ ప్రాంతంలో క్రైస్తవులను తమవైపునకు తిప్పుకునేందుకు బీజేపీ వ్యూహానికి పై ఎత్తు వేసినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం క్రిస్టియన్లకు వ్యతిరేకం అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైసీపీ పాత్ర ఉందనే ప్రచారం ఉంది.

### మతం మారితే ఎస్సీ ప్రాతిపదికన పొందే ప్రయోజనాలు కోల్పోతారు

మరోవైపు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు మంత మార్చితే వారి కుటం రద్దు అవుతుంది అని సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. దళితులు క్రైస్తవ మతంలోకి మారితే వారు బీసీలోకి చేర్చబడతారని దళిత రిజర్వేషన్ కోల్పోతారు అని తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో దళిత క్రైస్తవులు కూటమికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. దళిత క్రైస్తవులు వైసీపీకి ఫేవర్‌మారుతున్నారు. ఇదికూడా వైసీపీకి కలిసివచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మట్నత్తానికి మావిగన్ అంశం, జనాభా పరంగా అతిపెద్ద సామాజిక వర్గమైన కాపులను తమవైపునకు తిప్పుకోవడం, క్రిస్టియన్ ఓటర్లను ఆకట్టుకునేందుకు వైసీపీ వ్యూహాలు రచిస్తోందని పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతుంది. వైఎస్ జగన్ సరైన సమయంలో ఈ మూడు అస్త్రాలను ప్రయోగిస్తారనే రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# భానుడి భగభగలు

**- పది రోజులు బయటకు రావద్దు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. భానుడు భగభగలతో మండిపోతున్నాయి. ఒడిశా, తమిళనాడు, తెలంగాణను ఆనుకొని ఉపరితల ఆవర్తనం నెలకొంది. దాంతో సముద్రమట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలో ఉరుములు మెరుపులతో జల్లులు పడే అవకాశం ఉందని, మూడు రోజులపాటు ఏపీ, కర్ణాటకలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని చెప్పింది. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

### పది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్..

తెలంగాణలో ఎండల తీవ్రత మరింత పెరగనున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మూడు రోజులపాటు ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని చెప్పింది. తెలంగాణలో 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను వాతావరణ శాఖ జారీ చేసింది. తెలంగాణలో ఎండల ప్రభావం తీవ్రంగా ఉండనుంది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఏప్రిల్ 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వరుసగా 10 రోజుల పాటు తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తర, తూర్పు జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, ములుగు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 44డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉని హెచ్చరించింది. హైదరాబాద్‌లో కూడా నలభై డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ప్రజలు మధ్యాహ్నం పదకొండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

### ఏపీలో ఇక్కడ టెంపరేచర్స్

ఆంధ్రప్రదేశ్ లోనూ ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతున్నాయి. సూర్యుడి ప్రతాపంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడిపోతున్నారు. విజయవాడ, రాజమహేంద్రవరంలో 38 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రత నమోదుకు అవకాశం ఉంది. ఇక గూడూరు, నంద్యాల, అనంతపురంలో 38 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలున్నాయి. అదే విధంగా ఉత్తరాంధ్రలోని 16 మండలాల్లో వడగాల్పులకు అవకాశమున్నట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ పేర్కొంది. ఉత్తరాంధ్రకు వడగాలుల హెచ్చరిక జారీ అయింది. రాయలసీమలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అకాల వర్షాలతో పడటంతో పాటు అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ప్రపంచ ఉగ్రవాద సూచీలో పాకిస్థాన్‌దే ప్రథమస్థానం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద మరణాలు, దాడుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్‌లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026లో పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది అక్కడ ఉగ్రవాద సంబంధిత ఘటనల్లో ఏకంగా 1,139 మంది ప్రాణాలు కోల్పోయినట్లు శనివారం విడుదలైన ఒక నివేదిక వెల్లడించింది. మొరాకోకు చెందిన జర్నలిస్ట్, పరిశోధకురాలు ఫాతిమా ఎల్ హాషిమి 'అమెరికన్ థింకర్' అనే ఆన్‌లైన్ మ్యాగజైన్‌లో ఈ విషయంపై విశ్లేషించారు. పాకిస్థాన్‌లో హింస ఒక సాధారణ విషయంగా మారిపోయిందని, ఇది దేశ భద్రతా వ్యవస్థ తీవ్రంగా క్షీణిస్తోందనడానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. పాక్‌లో ఉగ్రవాదం పెరగడం ఇది వరుసగా ఆరో ఏడాది అని ఆమె గుర్తుచేశారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా మరణాల సంఖ్య పెరిగిందని తెలిపారు.2025లో జరిగిన దాడుల్లో 74 శాతానికి పైగా, మరణాల్లో 67 శాతం ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే నమోదయ్యాయని ఫాతిమా వివరించారు. ఈ ప్రాంతాల్లో పాలన, అభివృద్ధి లేకపోవడం వల్లే అంతర్గత సంఘర్షణలకు కేంద్రంగా మారాయని ఆమె అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ ఉగ్రవాద నిరోధక వ్యూహం కేవలం సైనిక చర్యలకే పరిమితమైందని, పాలనాపరమైన సంస్కరణలు, తీవ్రవాదాన్ని నిరోధించే ఇతర చర్యలు బలహీనంగా ఉన్నాయని ఫాతిమా విమర్శించారు. కేవలం సైనిక బలంతో కాకుండా రాజకీయ స్పష్టత, సమర్థవంతమైన పాలన, పొరుగు దేశాలతో (ముఖ్యంగా ఆఫ్ఘనిస్థాన్‌తో) సత్సంబంధాలు వంటి చర్యలు చేపడితేనే పాకిస్థాన్‌లో శాంతి నెలకొంటుందని ఆమె స్పష్టం చేశారు.

## తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్.?

నెలాఖరుతో ముగియనుండటంతో, తదుపరి వారసుడిగా ఆనంద్ పగ్గాలు చేపట్టనున్నారు.

### సీనియారిటీలో తిరుగులేని అధికారి

ప్రస్తుతం తెలంగాణ పోలీస్ క్యాడర్‌లో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ అధికారిగా ఉన్నారు. 1989, 1990 బ్యాచ్‌లకు చెందిన అధికారులు రిటైర్ అవ్వడం లేదా కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో, 1991 బ్యాచ్‌కు చెందిన ఆనంద్ రేసులో అందరికంటే ముందు నిలిచారు. ఖూాజ ప్రతిపాదించిన జాబితాలో వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా పేర్లు ఉన్నప్పటికీ, వారు 1994 బ్యాచ్ వారు కావడంతో ఆనంద్‌కు ఉన్న మూడేళ్ల అదనపు సీనియారిటీ ప్రధాన బలంగా మారింది.

### దీర్ఘకాలిక పదవీ కాలం ప్లస్ పాయింట్

ప్రభుత్వం సీవీ ఆనంద్‌ను ఎంపిక చేయడానికి మరో కీలక కారణం ఆయన సర్వీస్ కాలం. ఆయన 2028 మే వరకు సర్వీసులో ఉంటారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, డీజీపీగా నియమితులైన వారు కనీసం రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉండాలి. సీవీ ఆనంద్ నియామకం జరిగితే, ఆయనకు రెండేళ్లకు పైగా పదవీ కాలం ఉంటుంది. ఇది రాష్ట్రంలో శాంతిభద్రతల స్థిరత్వానికి, పోలీస్ సంస్కరణల అమలుకు దోహదపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

### అపార అనుభవం.. క్షేత్రస్థాయి పట్టు

సీవీ ఆనంద్‌కు క్షేత్రస్థాయిలో పరిపాలనలో విశేష అనుభవం ఉంది. గతంలో ఆయన హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి మెట్రోపాలిటన్ పోలీసింగ్‌లో తనదైన ముద్ర వేశారు.

ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, పౌర సరఫరాల శాఖలో ఐటీ సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రభుత్వానికి భారీగా ఆదాయం మిగిల్చారు. రాష్ట్ర భౌగోళిక పరిస్థితులపై, ప్రస్తుత సవాళ్లపై ఆయనకు ఉన్న పట్టును పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఆయన వైపే మొగ్గు చూపింది.

### ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన

ప్రస్తుత డీజీపీ బి. శివధర్ రెడ్డి 1994 బ్యాచ్ అధికారి అయినప్పటికీ, గతంలో అనివార్య కారణాల వల్ల ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది. ఇప్పుడు నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి డీజీపీని నియమించాల్సి ఉండటంతో ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది. సీవీ ఆనంద్ పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఈ నియామకంతో తెలంగాణ పోలీస్ శాఖలో సరికొత్త మార్పులు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

## అమీన్‌పూర్‌లో హైడ్రా
## అత్యంత భారీ ఆపరేషన్

ఈ భూమికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భూకబ్జాదారుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎం.ఏ. ముఖీం నిర్మించిన అక్రమ కట్టడాలను అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు. ఇందులో 40 ఎకరాల్లో నిర్మించిన విలాసవంతమైన గెస్ట్ హౌస్, ఫామ్‌హౌస్‌తో పాటు, అతని సోదరుడు ఎం.ఏ. అజీం 2.20 ఎకరాల్లో కట్టిన 6 అంతస్తుల అపార్ట్‌మెంట్‌ను కూడా కూల్చివేశారు. స్విమ్మింగ్ పూల్, పశువుల పాకలు, గుర్రాల కోసం నిర్మించిన షెడ్లను సైతం తొలగించారు.అయితే, ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు మైకుల ద్వారా ప్రకటించడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వ చర్యతో, ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్న పాత లేఅవుట్ల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

అమీన్‌పూర్ మండలం ఈలాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1 నుంచి 220 వరకు ఉన్న 1,263 ఎకరాల భూమి నిజాం పాలకులకు చెందినదిగా రికార్డుల్లో ఉంది. విలీన ప్రక్రియ తర్వాత ఇది ప్రభుత్వ భూమిగా మారింది. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని 1998లోనే హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. అనంతరం 2003లో హైకోర్టు డివిజన్ బెంచ్ కూడా ఈ భూమి ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పింది. అయినప్పటికీ, కోర్టు ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకుండా ముఖీం 2006లో ఇక్కడ భారీ నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా, స్థానిక ప్రజాప్రతినిధులతో సంబంధాలు కొనసాగిస్తూ ఈ భూమిలో ఇష్టానుసారంగా అమ్మకాలు జరుపుతూ వందల కోట్లు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

చట్టాలను, అధికారులను లెక్కచేయకుండా సాగిస్తున్న ముఖీం అక్రమాలకు తాజా ఆపరేషన్‌తో ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. మొత్తం 1,263 ఎకరాల్లో ఇప్పటికే నిర్మాణాలు జరిగిన ప్రాంతాన్ని మినహాయించి, ఖాళీగా ఉన్న 861 ఎకరాల భూమిని పూర్తిగా తన అధీనంలోకి తీసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.ఇక ఈ ఐలాపురం కూల్చివేతలపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆ భూములపై 1998లో హైకోర్టు స్టేటస్ కో ఉందని వాటిని ఆక్రమించి ముఖీమ్ ఫామ్ హౌస్ నిర్మించుకున్నట్లు తెలిపారు. 2006లో ఫాంహౌస్‌ను నిర్మించి దాన్ని 40 ఎకరాలకు విస్తరించాడని పేర్కొన్నారు. అనుచరులతో కలిసి ముఖీమ్ 20 ఏళ్లుగా భూ ఆక్రమణలు చేస్తున్నాడని వివరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లుగా చేసి రూ.కోట్లు సంపాదించినట్లు వెల్లడించారు. 100 గజాలకు రూ.10 లక్షల చొప్పున విక్రయించాడని తెలిపారు.

### బీసీ మహిళల ఉప కోటా కోసం
## ఢిల్లీని గడగడలాడిస్తాం

ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వకపోవడం అంటే పాలకులకు ఆ వర్గాల పట్ల గౌరవం లేదని అర్థమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉద్ధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా సమయంలో తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తానని కవిత వెల్లడించారు. కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తే... ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పి, ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా గళమెత్తారు. వారి క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని, కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనల్లో తమ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారిపై ప్రభుత్వం చర్యలకు దిగాలని చూడటం సరికాదన్నారు. పూలే చూపిన సామాజిక న్యాయం బాటలో నడుస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## నమ్మకంతోనే జయం

పథకాలను అమలు చేసి చూపించారు. రైతు భరోసాను కొంత ఆలస్యంగా అమలు చేశారన్న విమర్శలను ఎదుర్కొన్నారు. పింఛను, మహిళలకు నెలకు 1,500 రూపాయలు, కల్యాణమస్తు పథకాలను అమలు చేయాల్సి ఉంది. ప్రజలకు వాస్తవాలు చెప్పి తనను నమ్మాలని మరొకసారి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే రేవంత్ రెడ్డి ఉన్నారు. మరి ప్రజలు దీనిని ఎలా తీసుకుంటారన్నది చూడాలి.

## బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు

చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు.

### చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు

అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## తెలంగాణలో ఎస్ఐఆర్ వాయిదా

మూడో విడతలో తెలంగాణ మిగతా రాష్ట్రాల్లో మ్యాపింగ్ ప్రక్రియ ప్రారంభించగా ఇప్పటివరకు సుమారు 80 శాతానికిపైగా పూర్తయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 100 శాతం పూర్తికాగా ఓటర్ల వివరాలను సర్ ప్రక్రియలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తారు. ఏప్రిల్‌లోనే ఎస్ఐఆర్ ప్రారంభించాలని భావించిన ఈసీ అందుకు కార్యాచరణ సిద్ధం చేసింది.కానీ, వచ్చే నెలలో జనగణన జరగాల్సి ఉండటం ఏప్రిల్, మే నెలల్లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను వాయిదా పడింది. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు చోట్ల నమోదైన ఓటర్ల సంఖ్య 4.5 లక్షలుగా ఉన్నట్టు ఈసీ అధికారుల అంచనా. క్షేత్రస్థాయిలో ఇప్పటికే నిర్వహించిన సర్వేలో 2 లక్షల ఓట్లను తొలగించారు. సర్వే పూర్తయిన తర్వాత మరణించినవారి పేర్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదైన వారి పేర్లను తొలగిస్తారు. ఇక, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 11 రకాల ఐడెంటిటీ కార్డులను ప్రామాణికంగా తీసుకోనున్నారు. 1987 ముందు జన్మించిన వారికి తల్లిదండ్రుల వివరాలు, 1987-2004 మధ్య పుట్టినవారికి బర్త్ సర్టిఫికెట్లు, 2004 తర్వాత మిగతావాటిని పరిగణలోకి తీసుకోనుంది. వీటిలో పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డు, 1987 కంటే ముందు దేశంలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, బ్యాంకులు, ఎల్ఐసీ, బర్త్, క్యాస్ట్ సర్టిఫికెట్లు, యూనివర్సిటీ సర్టిఫికెట్లు, పర్మినెంట్ రెసిడెన్స్ సర్టిఫికెట్లు, ఫారెస్ట్ రైట్స్ డాక్యుమెంట్లు, జాతీయ గుర్తింపు కార్డు, స్థానికంగా అధికారులు జారీచేసే కుటుంబ గుర్తింపు పత్రాలు, ప్రభుత్వం ఇచ్చే భూమి లేదా నివాస కేటాయింపు పత్రం ఏవైనా పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

## జీవన్ రెడ్డి నిర్ణయం సరికాదు

వీడటం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. దశాబ్దాల పాటు కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై అలుపెరగని పోరాటం చేసిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధపడటం చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి చర్యలు ఆయన రాజకీయ స్థాయికి తగవని, నవ్వుల పాలు కావద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఎల్లప్పుడూ సముచిత గౌరవం ఇచ్చిందని, కీలక బాధ్యతలు అప్పగించిందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వ్యక్తిగత అసంతృప్తి కంటే పార్టీ సిద్ధాంతాలే ముఖ్యమని, ఇన్నేళ్ల రాజకీయ అనుబంధాన్ని తెంచుకోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. పార్టీ వీడినప్పటికీ ఆయనపై తమకు వ్యక్తిగత గౌరవం ఉందని, అయితే ఇప్పటికైనా తన నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఆయన కోరారు. ఒకవేళ జీవన్ రెడ్డి తన మనసు మార్చుకుని వెనక్కి తగ్గితే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు, పార్టీకి మేలు చేస్తుందని అన్నారు. రాజకీయాల్లో ఆవేశం కంటే ఆలోచన ముఖ్యమని, ఆయన తప్పుడు దారిలో వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కాఫీ విత్ చంద్రబాబు

కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. గతంలో వైసీపీ 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే, కూటమి ప్రభుత్వం వాటిని తగ్గిస్తోందన్నారు. ఇంకా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నమన్నారు. సమగ్ర నీటి నిర్వహణతో భూగర్భ జలాలు పెంచడంతో పాటు ప్రాజెక్టుల్లో నీరు నింపాం. మే 15వ తేదీనే పంటలకు నీళ్లు ఇస్తామన్నారు. దామాషా ప్రకారం ప్రతీ కులానికి రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పిస్తామని, నీతి నిజాయితీగా ఉంటేనే విలువగల రాజకీయాలు చేయగలుగుతామని తెలిపారు. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ అనే వ్యవస్థను తెస్తామన్నారు. కార్యకర్తలు ఆరోగ్యంగా ఉండాలని, రోజూ యోగా చేయాలని, యోగా ట్రైనర్స్ ద్వారా జిల్లాలో శిక్షణ ఇప్పిస్తామని చంద్రబాబు తెలిపారు.

## అధికారం ఎవరికీ
# శాశ్వతం కాదు

కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పటికీ, అక్రమంగా చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు సాగలేదని అన్నారు. ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే భూముల్లో కొత్త నగరాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క, సీతక్క వంటి నేతలు పాదయాత్రలు చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరించాలని చూడటం వెనుక రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఉన్న సిటీలో దోమల నివారణ కూడా చేయలేని ప్రభుత్వం, ఫ్యూచరే లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

ఇక నిషేధిత భూముల జాబితాను (22ఏ) అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను ఏకంగా కోటి ఎకరాలకు పెంచి, భూ యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు పెచ్చుమీరాయని, హోటళ్లు, బార్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, నిబంధనలు అతిక్రమించి కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తప్పుడు ప్రచారం చేస్తే చెప్పు తెగుద్ది

## – మంత్రి సీతక్క ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అవినీతి ఆరోపణలపై రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు అందించిన సెల్‌ఫోన్ల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పథకాలపై ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే చెప్పు తెగుతుంది అంటూ ఘాటుగా హెచ్చరించారు. ములుగులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అంగన్వాడీ టీచర్ల కోసం ఒక్కో సెల్‌ఫోన్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని, కానీ కొందరు రూ.14 వేలకు కొన్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలుంటే చూపించాలని సవాల్ విసిరారు. తాను ఎక్కడా అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు.

ఇటీవల జరిగిన మేడారం జాతర పనుల్లోనూ అవినీతి జరిగిందన్న ఆరోపణలపై స్పందిస్తూ.. అవసరమైతే దీనిపై సీబీఐ విచారణకైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ నేతలు తనను ప్రలోభాలకు గురిచేయాలని చూసినా లొంగలేదని గుర్తుచేశారు. ఎన్నికల్లో తనను ఓడించడానికి వందల కోట్లు ఖర్చుపెట్టి తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు.


### - రూ.30 కోట్ల కుంభకోణం జరిగిందన్న బీఆర్ఎస్

మరోవైపు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఇటీవల మంత్రి సీతక్క శాఖలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన 'పోషణ్ అభియాన్' కింద 38,130 స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు రూ.54.19 కోట్లతో టెండర్లు పిలిచారని తెలిపారు. టెండర్‌లో 5జీ ఫోన్లు అని పేర్కొని, 4జీ మోడల్ (శాంసంగ్ ఏ06) ఫోన్లను పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ ఫోన్‌కు, ప్రభుత్వం టెండర్‌లో రూ.14,215 చెల్లించేలా ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ఈ లెక్కన మొత్తం కొనుగోళ్ల విలువ రూ.24 కోట్లు మాత్రమే ఉండాల్సి ఉండగా, అదనంగా చెల్లించి సుమారు రూ.30 కోట్ల అవినీతికి పాల్పడ్డారని క్రిశాంక్ ఆరోపించారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి.

# ఐలాపూర్‌లో హైడ్రా

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు





అమీన్‌పూర్(ప్రశ్న న్యూస్ ) శనివారం ఉదయం ఐలాపూర్ ప్రాంతంలో భారీ ఎత్తున హైడ్రా బలగాలు మోహరించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు చేపట్టాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు కొనసాగినట్లు అధికారులు తెలిపారు.ప్రభుత్వ భూములు భవిష్యత్తులో కబ్జాలకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తగా ఇనుప కంచె ఏర్పాటు చేసి, భూమికి రక్షణ కల్పించారు. ఈ చర్యల ద్వారా బీదలకు ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా వివాదాస్పద ఐలాపూర్ భూముల్లో ఉన్న న్యాయవాది ముఖిమ్‌కు చెందిన గెస్ట్ హౌస్‌ను పూర్తిగా నేలమట్టం చేశారు. అలాగే, ఆయన సోదరుడు అజీమ్ ఐలాపూర్--కిష్టారెడ్డిపేట సరిహద్దు ప్రాంతంలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనంపై కూడా హైడ్రా అధికారులు చర్యలు శనివారం సాయంత్రం వరకు నడిచాయి.సమీప గ్రామ సర్వే నంబర్లతో అనుమతులు పొందినట్లు ఆరోపణలు ఉన్న ఈ భవనాన్ని కూల్చివేతకు పూనుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు హెచ్చరించారు.

### కమిషనర్ రంగనాథ్ వివరణ

అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్‌లో జరుగుతున్న హైడ్రా కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. ఐలాపూర్ భూములకు సంబంధించి 1998లో హైకోర్టు స్టేటస్ కో ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ముఖీమ్ అనే వ్యక్తి ఫామ్‌హౌస్ నిర్మించుకున్నాడని రంగనాథ్ వెల్లడించారు. 2006లో నిర్మించిన ఈ ఫామ్‌హౌస్‌ను క్రమంగా విస్తరించి ప్రస్తుతం దాదాపు 40 ఎకరాలకు పెంచినట్లు తెలిపారు. ఈ ఫామ్‌హౌస్‌ను కేంద్రంగా చేసుకుని గత 20 ఏళ్లుగా ముఖీమ్ తన అనుచరులతో కలిసి భూదందా కొనసాగించాడని ఆరోపించారు.ప్రభుత్వ భూములను అక్రమంగా ప్లాట్లుగా విభజించి విక్రయించడం ద్వారా కోట్ల రూపాయలు సంపాదించాడని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పేదలను లక్ష్యంగా చేసుకుని 100 గజాల ప్లాట్లను సుమారు రూ.10 లక్షల చొప్పున విక్రయించినట్లు తెలిపారు.హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ భూకబ్జాలకు పాల్పడినట్లు స్పష్టం చేసిన రంగనాథ్, ఐలాపూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని చెప్పారు. సోషల్ మీడియాలో హైడ్రా చర్యలపై తప్పుడు ప్రచారం జరుగుతోందని మండిపడ్డారు.ప్రభుత్వ భూములను రక్షించడం, భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా నిరోధించడం కోసం కూల్చివేతలు చేపడుతున్నామని హైడ్రా అధికారులు

# ఎమర్జెన్సీ సర్వీస్ అని మర్చిపోయి నిద్రపోయారు

**డ్యూటీ గాలికి వదిలేసిన లాలాగూడ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది**
**రాత్రిళ్లు నిద్రలో అధికారులు, సిబ్బంది**
**ఎమర్జెన్సీ సేవలకే ఎగనామం,**
**లాలాగూడ ఎఫ్ఓసీ, ఏఈ నంబర్ బిజీ టోన్**
**కరెంట్ పోతే ప్రజలకే కష్టం, అధికారుల బాధ్యతారాహిత్యంపై ఆగ్రహం**

హైదరాబాదు (ప్రశ్న న్యూస్)రాత్రి సమయంలో అత్యవసర సేవలు అందించాల్సిన విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం బయటపడుతోంది. ముఖ్యంగా లాలాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఎమర్జెన్సీ సమయంలో స్పందించాల్సిన ఎఫ్ఓసీ (ఖీాజ) నంబర్లు బిజీ పెట్టి పనిచేయకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఫిర్యాదు చేయడానికి కాల్ చేస్తే బిజీ టోన్ మాత్రమే వినిపిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఎమర్జెన్సీ డ్యూటీ అంటే నిద్రపోవడమా.?

ఎమర్జెన్సీ శాఖగా పేరున్న విద్యుత్ విభాగం అధికారులు బాధ్యతను పూర్తిగా విస్మరించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి సమయంలో విధుల్లో ఉండాల్సిన లాలాగూడ ఎఫ్ఓసి సిబ్బంది, ఏఈ స్థాయి అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజలకు అవసరమైన సమయాల్లో స్పందించకుండా హాయిగా నిద్రపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### కరెంట్ కట్ అయితే నరకం.. స్పందన శూన్యం

లాలాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళ కరెంట్ పోతే పరిస్థితి దారుణంగా మారుతోంది. ఫ్యాన్లు, లైట్లు, ఏసి లు పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు ఉన్న కుటుంబాలు మరింత కష్టాలు ఎదుర్కొంటున్నాయి. అయినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేకపోవడం ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది.

### ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

ఏడి, డిఈ, ఎండి స్థాయి ఉన్నతాధికారులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఎమర్జెన్సీ డ్యూటీపై ఉండి నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. ఇలాంటి నిర్లక్ష్యానికి పాల్పడుతున్న సిబ్బంది, అధికారులపై సస్పెన్షన్ వేటు వేయాలనే డిమాండ్ ప్రజల నుండి పెరుగుతోంది.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విమర్శలు

ప్రజల ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు, మంత్రుల వైఖరిపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారుల్లో బాధ్యత తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. "పాలనలో పడకేసిన రేవంత్ సర్కార్" అంటూ స్థానికులు ఘాటుగా విమర్శిస్తున్నారు.

### చర్యలు తీసుకుంటారా.? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా.?



ఎమర్జెన్సీ సేవలే ఇంత నిర్లక్ష్యంగా మారితే ప్రజల పరిస్థితి ఏమవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లాలాగూడ సబ్ స్టేషన్ పరిధిలో పూర్తి బాధ్యత అరాహిత్యం గా వ్యవహరిస్తున్న సిబ్బంది, ఏఈ పై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైన విద్యుత్ శాఖ ఎండి, ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా.? లేక ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయా అన్నది చూడాల్సి ఉంది.

# వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించడమే లక్ష్యం

### డి అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి** కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డి అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం అదే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక వైద్య చికిత్సలు, నిపుణుల పర్యవేక్షణలో పునరావాస సేవలు, నిరంతర కౌన్సిలింగ్ అందించబడతాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మద్యానికి బానిసై చికిత్స కోసం వచ్చిన రోగితో మాట్లాడి, రోజువారీ ఆదాయం, మద్యంపై ఖర్చు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ వ్యక్తి తాను మద్యం మానేందుకు పలు మార్లు ప్రయత్నించినప్పటికీ, వణుకుడు, ఫిట్స్ వంటి సమస్యలు రావడంతో చికిత్స కోసం ఈ కేంద్రానికి వచ్చానని తెలిపాడు. ఈ తరహా కేసులకు అందిస్తున్న వైద్య సేవలు, కౌన్సిలింగ్ విధానాలు, చికిత్స ప్రక్రియ గురించి కలెక్టర్ అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా సమగ్ర చికిత్సతో పాటు నిరంతర కౌన్సిలింగ్ అందించాలని వైద్యులకు సూచించారు. ఇదే సందర్భంగా "డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే" కార్యక్రమం కింద నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి కలెక్టర్ ప్రశంస పత్రాలు, శిల్డులను అందజేశారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మత్తు వ్యసన నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు, వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు బాధితులను ప్రోత్సహించి, ఈ కేంద్రం సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, ఆసుపత్రి సూపర్డెంట్ రమేష్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాదా మోహన్, ఇతర వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పూలే కు నివాళులు అర్పించిన సిపిఐ నాయకులు




**నరసరావుపేట** పల్నాడు జిల్లా నరసరావుపేట పల్నాడు బస్టాండు లో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి ఆయన 199వ జయంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న సిపిఐ నాయకులు మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం అసమానతలు తొలగిపోవాలని క్రాంతిరేఖ, దీనజనుల జీవితాల్లో వెలుగు రేఖ నింపాలని కలలగన్న మహాత్మా జ్యోతిరావు పూలే కు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్, సిపిఐ సీనియర్నాయకులు ఉప్పలపాడు రంగయ్య, సూరి తదితరులు పాల్గొన్నారు.

## శిరివెళ్ళలో చలి వేంద్రాలు ఎక్కడా?

# ప్రజల దాహాన్ని తీర్చేవారే లేరా...



**శిరివెళ్ల** మండే ఎండలు మండల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.దాహార్తిని తీర్చాల్సిన చలివేంద్రాలు మాత్రం ఎక్కడా కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఏప్రిల్ మొదలైన వెంటనే ఎండలు విపరీతంగా పెరిగినా , శిరివెళ్ళ మండలంలో ఒక్క చలివేంద్రం కూడా ఏర్పాటు కాకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.రోజూ పనుల నిమిత్తం బయటకు వచ్చే కూలీలు , కార్మికులు , ఆటో డ్రైవర్లు , బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మజ్జిగ , నీళ్లు పంపిణీ చేస్తూ ప్రజలకు ఉపశమనం కలిగించేవి. కానీ ఈసారి ఎవరూ ముందుకు రాకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది.మండల హెడ్‌క్వార్టర్‌గా శిరివెళ్ళకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. పోలీస్ స్టేషన్ , తహశీల్దార్ కార్యాలయం , ఎంపిడిఓ కార్యాలయం , అగ్రికల్చర్ ఆఫీస్ వంటి కీలక కేంద్రాల వద్ద కూడా తాగునీటి సదుపాయం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు.ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితుల్లో కూడా అధికారులు , ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల దాహం కూడా తీర్చలేని వారు , ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారు అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి , మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గుంజపడుగు గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు.

**శ్రీధర్ బాబు ఆశీస్సులతో..సర్పంచ్ దండేవేన సంధ్య.**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల పరిధిలోని గుంజపడుగు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేసిన దండేవేన సంధ్య బానేష్ గుంజపడుగు బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు ఈ సందర్భంగా దండేవేనసంధ్య బానేష్ మాట్లాడుతూ చలివేంద్రం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేయడం వలన గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే ప్రయాణికులకు ఉపయోగపడుతుందని ఎండలు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండడానికి చలివేంద్రం ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉదర శంకరి, మాజీ ఎంపీటీసీ ఊదర లక్ష్మణ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

## విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

**అధికారులు స్పందించి వెంటనే ఈ సమస్యకు పరిష్కరించాలి.**

**పూలే స్ఫూర్తితో సమ్మెను ఉధృతం చేస్తాం**

**జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని లోని ఎన్ పీడీసీఎల్ డి ఈ కార్యాలయం ముందు సమ్మె శిబిరం వద్ద మహాత్మ జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్లు అన్ మాండు,పీస్ రేట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబాలని పోషించుకుంటున్నారని వీరిని కనీసం ఉద్యోగులుగా చూడడం లేదని విమర్శించారు విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్న విద్యుత్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని అన్నారు అత్యవసర పరిస్థితుల్లో రాత్రింబవళ్లు సమాజ క్షేమం కోసం పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని లేని పక్షంలో జ్యోతిబాపూలే జయంతి స్ఫూర్తితో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏల్పుల సురేష్, బాబు రవి విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే

# జయంతి వేడుకలు

**సామాజిక అసమానతలను తొలగించడమే పూలే ఆశయం**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా.సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకల్లో అదరపు కలెక్టర్ నగేష్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్ , వివిధ కుల సంఘాల నాయకులలతో కలిసి కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ మాసం అంటేనే మహనీయుల మాసం అని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి నాంది పలికిన ఆయన మహిళల విద్యకు ప్రాధాన్యతనిస్తూ తొలి బాలికల పాఠశాలను స్థాపించారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి శ్రమించి, అణగారిన వర్గాలకు సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారు.

దేశంలోని అణగారిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం ప్రస్తుత ప్రభుత్వానికి మార్గదర్శకమని అన్నారు.అంతకుముందు వివిధ కుల సంఘాల నాయకులు జ్యోతిబాపూలే గొప్పదనాన్ని వివరిస్తూ వక్తలు తమ సందేశాన్ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు దొంతి నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, పద్మశాలి సంఘం అధ్యక్షులు మేకల జయరాములు, నాయని బ్రాహ్మణి సంఘం అధ్యక్షులు శ్రీ ఉప్పల స్వామి, మాల మహానాడు గౌరవ అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం, బి సంగమేశ్వర్ సంబంధిత ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వం వేడుకుంటోంది.. మనిషి మేల్కోవాలి





ఈ వ్యాసం రాయడానికి కూర్చున్నప్పుడు మనసులో ఒక భారం ఉంది. యుద్ధభూమిలో ఏడుస్తున్న పసిపాప, కాలిన అడవిలో పరిగెత్తే జింక, విషపూరితమైన నదిలో నిలబడిన రైతు, ఇవి కల్పనలు కావు. ఈ క్షణం జరుగుతున్న వాస్తవాలు.

### మనిషి ఈ భూమిపై పుట్టాడు..

ప్రేమించడానికి, సృష్టించడానికి. కానీ ఏమి చేస్తున్నాడు? తన చేతులతో తన భవిష్యత్తును తానే తగలబెట్టుకుంటున్నాడు.

### యుద్ధం.. మహాపాపం..

యుక్రెయిన్ లో, గాజాలో, సూడాన్ లో ఎక్కడ చూసినా రక్తం, పొగ, ఏడుపు. అగ్రరాజ్యాలు ఆయుధాలు అమ్ముతున్నాయి. చిన్న దేశాలు శ్మశానాలవుతున్నాయి. ఒక వైపు బాంబులు పడుతున్నాయి, మరొక వైపు వ్యాపారులు లాభాలు లెక్కిస్తున్నారు.గురజీ చెప్పారు, కంటికి కన్నుతో ప్రపంచమంతా గుడ్డిదవుతుంది. యుద్ధం సమస్యను పరిష్కరించదు, కొత్త సమస్యలు సృష్టిస్తుంది. నిజమైన శాంతి ఆయుధాల్లో లేదు మనసుల్లో ఉంది.పర్యావరణ విధ్వంసంభూమి మనకు తల్లి. ఆమె మనకు గాలి, నీళ్ళు, అన్నం ఇచ్చింది. మనం ఆమెకు ఏమిచ్చాం? కాలుష్యం, విషం, చెత్త.అమెజాన్ అడవులు నరికేస్తున్నారు. హిమాలయాల హిమానీనదాలు కరిగిపోతున్నాయి. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. వాతావరణ మార్పు భవిష్యత్తు సమస్య కాదు, ఈ క్షణం జరుగుతోంది.ప్రతి రోజూ నూరుకు పైగా జీవ జాతులు ఈ భూమి నుండి శాశ్వతంగా అదృశ్యమవుతున్నాయి. మనం మన పిల్లలకు వీటిని కేవలం చిత్రాలలో చూపిస్తామా.? మత విద్వేషాలుదేవుడు ఒక్కడే, ఆ ఒక్కడి పేరుతో వేల గొడవలు. ప్రతి మతం ప్రేమను బోధిస్తుంది. ప్రతి ధర్మగ్రంథం శాంతిని చెప్తుంది. అయినా మతం పేరుతో జరిగిన రక్తపాతం చరిత్రలో అపారం. క్రీస్తు ప్రేమను చెప్పాడు, ఆయన పేరుతో యుద్ధాలు జరిగాయి. మహమ్మద్ శాంతిని బోధించాడు, ఆయన పేరుతో హింస జరిగింది. మతం మనిషిని మంచిగా చేయడానికి వచ్చింది, మనిషి దాన్ని అస్త్రంగా మార్చాడు.నిజమైన మతం ఏమిటి? ఒక మొక్క నాటడంలో ఉంది. ఒక రోగిని కాపాడడంలో ఉంది. ఒక పక్షికి నీళ్ళు పెట్టడంలో ఉంది.

### మొక్క నాటడం, విప్లవం

ఇంత నిరాశ మధ్య కూడా ఆశ ఉంది. ఒక్క మొక్క నాటడం ఒక విప్లవం. మీరు చెప్తున్నారు, ఈ లోకం రేపు కూడా ఉంటుంది అని. ప్లాస్టిక్ తగ్గించండి. నీళ్ళు వృథా చేయకండి. స్థానిక రైతుల నుండి కూరగాయలు కొనండి. పిల్లలకు ప్రకృతితో అనుబంధం కలిగించండి. ఇవి చిన్న మార్పులు - కానీ కోటి మందిలో ఒక్కొక్కరు చేస్తే భారీ పరిణామం.

రాజ్యాధినేతలకు విజ్ఞప్తి

మీరు సంతకం చేసే ఆయుధ ఒప్పందాల వెనక వేల శవాలు ఉన్నాయి. మీరు అనుమతించే కాలుష్యం వెనక లక్షల రోగులు ఉన్నారు. ఒక్కసారి మీ పిల్లల కళ్ళలోకి చూడండి - వారికి ఏమి ఇవ్వాలనుకుంటున్నారు?

అణ్వాయుధాలతో నిండిన లోకమా? లేదా పచ్చని అడవులు, స్వచ్ఛమైన నదులు, ప్రేమతో నిండిన మనుషులా.?

ఒక వైద్యుడిగా చూస్తున్నది, పర్యావరణ కాలుష్యం వల్ల వ్యాధులు పెరుగుతున్నాయి. ఒక కవిగా అనుభవిస్తున్నది, ప్రకృతి లేకుండా కవిత్వం లేదు. ప్రకృతి ప్రేమికుడిగా కోరేది, ఈ భూమి పచ్చగా ఉండాలి.

### మనిషికి ఒక్క జన్మ. ఒక్క అవకాశం.

పుడమి తల్లిని కాపాడండి. జీవకోటిని ప్రేమించండి. యుద్ధాలు మానండి. మొక్కలు నాటండి. మనిషిని మనిషిగా చూడండి. ఇదే నా విజ్ఞప్తి. ఇదే నా ప్రార్థన. ఇదే నా జీవిత సందేశం.

**సింహాచలం లక్ష్మణస్వామి**
**కవి । రచయిత । ప్రకృతి ప్రేమికుడు**
**ఆయుర్వేద పారంపర మూలిక వైద్య**
**మహాసంఘం అధ్యక్షులు హైదరాబాద్**

# మాదకద్రవ్యాల రహిత తెలంగాణే లక్ష్యం

**- మత్తు పదార్థాలపై మేడ్చల్ డ్రగ్ కంట్రోల్ అధికారుల ఉక్కుపాదం**

**- ఔషధాల దుర్వినియోగం ప్రాణాంతకం**

**- సమాచారం ఇస్తే ప్రోత్సాహకాలు**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రాన్ని సంపూర్ణ మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు 'డ్రగ్స్ రహిత తెలంగాణ' కోసం ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ఈగల్ ఫోర్స్ అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. శనివారం మేడ్చల్ మండలంలోని కండ్లకోయ గ్రామంలో గల సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు, మెడికల్ షాప్ ల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బి.లక్ష్మీనారాయణ, ఈగల్ ఫోర్స్ టీం డిఎస్పి పి. బిక్షపతి రావు, కెమికల్ మరియు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ శర్మ, జిల్లా వైద్యాధికారిణి ఉమా గౌరీ, డ్రగ్ ఇన్స్పెక్టర్లు మౌనిక, హేమలతలు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం రూపొందించిన '99 రోజుల యాక్షన్ ప్లాన్', 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాజంలో చాపకింద నీరులా విస్తరిస్తున్న నకిలీ మందులు, దుర్వినియోగం అవుతున్న ఔషధాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. నకిలీ మందుల బెడదను అరికట్టడానికి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ నిరంతరం నిఘా ఉంచిందని వారు తెలిపారు. అనుమతి లేని, నకిలీ లైసెన్స్‌లతో మందులు విక్రయిస్తే లైసెన్స్‌ల రద్దుతో పాటు కఠినమైన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. మందుల దుకాణాలు లేదా హోల్‌సేలర్ల లైసెన్స్ నిజమైనదో కాదో తెలుసుకోవడానికి ప్రజలు శీసశ్రీర్.వశ్రీఖఅస్త్రుఋ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

### ఔషధాల దుర్వినియోగం ప్రాణాంతకం..

నిద్రమాత్రలు, ఆందోళన నివారణ మందులైన అల్ప్రజోలం, నైట్రాజీపం మరియు కోడైన్ కలిగిన దగ్గు సిరప్‌లను వైద్యుల సలహా లేకుండా వాడటం వల్ల ప్రాణాపాయం ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వీటిని అలవాటుగా మార్చుకోవడం వల్ల శ్వాసకోశ మాంద్యం, మూర్ఛలు వస్తాయని, ముఖ్యంగా మద్యంతో కలిపి తీసుకున్నప్పుడు కోమా లేదా మరణం సంభవించే అవకాశం ఉందని వివరించారు.

### సమాచారం ఇస్తే ప్రోత్సాహకాలు..

మాదకద్రవ్యాల సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని అందించే పౌరులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందజేస్తుందని ఈగల్ ఫోర్స్ అధికారులు తెలిపారు. 1908, 87126 71111 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఈగల్ ఫోర్స్ టీం డిఎస్పి పి. బిక్షపతి రావు తెలిపారు. తెలంగాణను డ్రగ్స్ రహితంగా మార్చడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని మేడ్చల్ డ్రగ్ కంట్రోల్ విభాగం కోరింది.

### సొంత వైద్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోకండి..

నేటి కాలంలో చిన్న తలనొప్పి వచ్చినా, జ్వరం అనిపించినా వెంటనే డాక్టరు దగ్గరకు వెళ్లే ఓపిక, సమయం చాలామందికి ఉండటం లేదు. దానికి బదులు ఇంట్లో ఉన్న పాత మందులనో లేదా మెడికల్ షాపుకు వెళ్లి అడిగి తీసుకునే మందులనో వాడుతుంటారు. సొంత వైద్యం వల్ల బయటకు కనిపించే లక్షణాలు ఒకేలా ఉన్నా, లోపల ఉన్న వ్యాధి వేరుగా ఉండవచ్చు. మనకు తెలియకుండానే యాంటీబయోటిక్స్ వాడటం వల్ల శరీరంలోని బ్యాక్టీరియా ఆ మందులకు అలవాటు పడిపోతుంది. భవిష్యత్తులో నిజంగా అవసరమైనప్పుడు ఆ మందులు పని చేయవు. ఏ మందు ఏ మోతాదులో వాడాలో తెలియకపోతే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఉంది. ఇంట్లో పాత మందులు వాడటం వల్ల రియాక్షన్ వచ్చి వికటించే ప్రమాదం ఉంది.

## నూతన ప్రెస్ క్లబ్ పాలకవర్గానికి ఘన సన్మానం

**- ప్రజల పక్షాన నిలవాలని భాజపా పిలుపు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో తాజాగా ఎన్నికైన ఐజేయు ప్రెస్ క్లబ్ పాలకవర్గానికి బీజేపీ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాపల్లి శ్రీనివాస్,ఆయన బృందాన్ని సన్మానిస్తూ భాజపా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, మీడియా ప్రజలు, ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, మీడియా ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన నిలబడి సమస్యలను వెలుగులోకి తీసుకురావడం గొప్ప సేవ అని కొనియాడారు. సమాజంలో జరిగే ప్రతి అంశాన్ని ప్రజలకు చేరవేసే బాధ్యత మీడియాపైనే ఉందని తెలిపారు.కౌన్సిలర్ ముత్యం మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా (4వ ఎస్టేట్ ) గుర్తింపు పొందిందని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలకు మీడియాకు అనుమతి ఉన్నప్పటికీ, మున్సిపల్ సమావేశాలకు అనుమతి ఇవ్వకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. రానున్న మున్సిపల్ సమావేశంలో మీడియాకు ప్రవేశం కల్పించేలా బీజేపీ తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ కుమ్మరి శంకర్, వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, నాయకులు రేగుల మల్లికార్జున్, వైభవ్, బాలరాజు, కోల కృష్ణస్వామి, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజ్యం, బోనాల శివ, వివేక్ రెడ్డి, అన్నం నరసయ్య, నామాల శేఖర్, గుడిసె మనోజ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి రావు పూలే దంపతుల సామాజిక సేవలకు గుర్తింపుగా భారత రత్న ప్రకటించాలి

**తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి**

**టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**




హనుమకొండలోని(ప్రశ్న న్యూస్) కాకతీయ విశ్వవిద్యాలయంలో మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర జ్యోతి రావు పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ సామాజిక అసమానతలు రూపుమాపి అణగారిన బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాతలైన జ్యోతి రావు పూలే దంపతులకు భారత రత్న ఇవ్వాలని తెలంగాణ శాసన సభ శాసన మండలిలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఈ మేరకు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని తెలంగాణ రాష్ట ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ కేంద్ర ప్రభుత్వం కూడా పూలే దంపతుల అత్యున్నతమైన సేవలకు గుర్తింపుగా వెంటనే భారత రత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# 'డెకాయిట్' తొలి రోజు కలెక్షన్ల రికార్డ్...

## అడివి శేష్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్




యంగ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన 'డెకాయిట్' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనమైన ఆరంభాన్ని అందుకుంది. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా, తొలిరోజు రూ.15 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ అధికారికంగా ప్రకటించింది. ఈ వసూళ్లతో 'డెకాయిట్' అడివి శేష్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచి రికార్డు సృష్టించింది.ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ చిత్రం మొదటి రోజే 5.75 లక్షల డాలర్లకు పైగా వసూలు చేసి సత్తా చాటింది.(షనీల్ డియో దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌ను తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించారు. ప్రేక్షకుల నుంచి మంచి స్పందనతో ఈ చిత్రం సాలిడ్ ఓపెనింగ్స్‌ను నమోదు చేసింది. వారాంతంలో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అంచనాలన్నీ నిజమయ్యాయి!




'మేము ప్రేమతో ఈ సినిమా చేశాం. మీరు కూడా ప్రేమతో చూశారు. నాకు మరో సక్సెస్ ఇచ్చినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా షానియల్ డియో దర్శకత్వంలో సుప్రియా యార్లగడ్డ నిర్మించిన 'డెకాయిట్' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో ప్రేక్షకులతో కలిసి చిత్రబృందం సినిమాను వీక్షించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అడివి శేష్ మాట్లా డుతూ.. విడుదలైన అన్ని కేంద్రాల నుంచి సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తున్నదని, త్వరలో చాలా నగరాలు తిరిగి ప్రేక్షకుల్ని కలుసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. సినిమాలో తాను పోషించిన సరస్వతి పాత్ర అందరికీ నచ్చిందని కథానాయిక మృణాల్ ఠాకూర్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ సినిమా విషయంలో తాము పెట్టుకున్న అంచనాలన్నీ నిజమయ్యాయని దర్శకుడు షానియల్ డియో తెలిపారు.

# టీజర్ అదిరింది..

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.



# దళపతి ఆఖరి చిత్రానికి పైరసీ సెగ..

## - పూజా హెగ్డే ఆవేదన



తమిళ చిత్రసీమలో తిరుగులేని ఆధిపత్యం చలాయించిన దళపతి విజయ్, రాజకీయ అరంగేట్రం నేపథ్యంలో నటించిన చివరి సినిమా 'జన నాయగన్' అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సెన్సార్ ప్రక్రియలో జాప్యం కారణంగా విడుదల కాలేకపోతున్న ఈ చిత్రం, అనూహ్యంగా ఆన్‌లైన్‌లో లీక్ కావడం కోలీవుడ్‌తో పాటు భారతీయ చిత్ర పరిశ్రమను షాక్‌కు గురిచేసింది. ఈ దురదృష్టకర పరిణామంపై హీరోయిన్ పూజా హెగ్డే స్పందిస్తూ తీవ్ర ఉద్వేగానికి లోనయింది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు వేలాది మంది టెక్నీషియన్లు పడే కష్టం ఈ ఒక్క లీక్‌తో బూడిదలో పోసిన పన్నీరవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇది కేవలం ఒక సినిమాకు జరిగిన నష్టం కాదని, కళాకారుల ఆత్మగౌరవంపై జరిగిన దాడి అని ఆమె పేర్కొంది. మరోవైపు, ఈ పైరసీ ఉదంతం సినీ దిగ్గజాలను ఏకతాటిపైకి తెచ్చింది. రజనీకాంత్, చిరంజీవి, సూర్య వంటి అగ్ర తారలు ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండిస్తూ, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక చిత్రాన్ని ఇలా అగౌరవపరచడం సమంజసం కాదని, అభిమానులందరూ పైరసీని తిరస్కరించి థియేటర్లలోనే సినిమాను చూడాలని వారు పిలుపునిచ్చారు. ఇప్పటికే చిత్ర నిర్మాణ సంస్థ లీకులకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలకు దిగింది. అక్రమంగా క్లిప్పులను ప్రసారం చేసే సోషల్ మీడియా ఖాతాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. సినిమాను కాపాడుకోవాల్సిన బాధ్యత సినీ ప్రేమికులందరిపై ఉందంటూ పరిశ్రమ పెద్దలు గళం విప్పుతున్నారు.



## రాకా కోసం25కోట్లు?

డిమాండ్లు ఎక్కువ కావడంతో, చేస్తున్న సినిమాల నుంచి తొలగించబడి, ఉన్న డిమాండ్ కోల్పోయిందంటూ కొన్ని సోషల్ మీడియా వేదికలు దీపిక పదుకొణేపై వార్తలు రాశాయి. అయితే.. తాజాగా వినిపిస్తున్న ఓ బీటౌన్ వార్త.. దీపిక డిమాండ్ ఇసుమంత కూడా తగ్గలేదని, ఇంకా మాట్లాడితే, మరింత పెరిగిందని చెబుతున్నది. వివరాల్లోకెళ్తే.. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పానిండియా చిత్రం 'రాకా'లో దీపిక పదుకొణే కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నటించినందుకు గాను ఏకంగా 25కోట్ల పారితోషికాన్ని దీపిక పదుకొణే అందుకుంటున్నదట. ఇదే ఆ వార్త సారాంశం. భారతీయ చలనచిత్ర చరిత్రలో ఇంత పారితోషికం తీసుకున్న హీరోయిన్ మరొకరు లేరు. ఈ వార్త వాస్తవమైతే.. నిజంగా ఇది రికార్డే. అంతేకాదు, దీపికకు డిమాండ్ తగ్గిందని వార్తలు రాసిన వాళ్లకు ఈ వార్త ఓ చెంపపెట్టు. అల్లు అర్జున్, అట్లీ కూడా ఈ సినిమా కోసం భారీ పారితోషికాలనే తీసుకుంటున్నట్టు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ భారీ పానిండియా చిత్రం 2027 వేసవిలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది.

## ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'..

## స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. థియేటర్లలో సందడి చేసిన ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 16వ తేదీ నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఈ సినిమా అందుబాటులో ఉండనుంది. భారీ ధరకు నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చి 19న ఉగాది పండుగ కానుకగా థియేటర్లలో విడుదలైంది. విడుదలైన నాటి నుంచి బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా, రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు ఇప్పుడు ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విజయ్ సినిమా లీక్..

## పైరసీపై విరుచుకుపడ్డ సినీ ప్రముఖులు



కోలీవుడ్ స్టార్ విజయ్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'జన నాయకన్' విడుదలకు ముందే లీక్ అవ్వడం ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో పెను సంచలనాలను సృష్టిస్తుంది. రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్న విజయ్‌కి ఇది చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించిన సుమారు 5 నిమిషాల కీలక సన్నివేశాలు, టైటిల్ కార్డ్స్ మరియు క్లైమాక్స్ భాగాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కావడం చిత్ర యూనిట్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది. కొన్ని చోట్ల పూర్తి ఎణ వెర్షన్ కూడా లీక్ అయిందనే వార్తలు ఇండస్ట్రీ వర్గాలను కలవరపెడుతున్నాయి. ఈ దారుణమైన పైరసీ చర్యను సౌత్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఖండిస్తున్నారు.దర్శకుడు ఏఆర్ మురుగదాస్ ఈ ఘటనపై స్పందిస్తూ.. ఒక సినిమా వెనుక వేలాది మంది కష్టం ఉంటుందని, ఇలాంటి చర్యలు పరిశ్రమను నాశనం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హీరో కార్తీ కూడా దీనిపై ఘాటుగా స్పందిస్తూ, పైరసీ అనేది కేవలం దొంగతనం మాత్రమే కాదు, ఒక కళాకారుడి కష్టాన్ని మరియు కలలను చంపడమేనని పేర్కొన్నారు. అభిమానులు ఎవరూ ఈ లీకైన వీడియోలను చూడవద్దని, షేర్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు దర్శకుడు పా రంజిత్ డిజిటల్ సెక్యూరిటీలోని లోపాలను వేలెత్తి చూపుతూ, పైరసీ వెబ్‌సైట్లపై కఠినమైన చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. చిరంజీవి, కమల్ హాసన్, శివకార్తికేయన్ వంటి అగ్ర తారలు కూడా 'జన నాయకన్' టీమ్‌కు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాణ సంస్థ KVN ప్రొడక్షన్స్ ఇప్పటికే రంగంలోకి దిగి, లీక్ చేసిన వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## పూలే సిద్ధాంతాలే సమాజానికి మార్గదర్శనం


- బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలి
- కుల గణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలి
- బీసీ సాధికారత సంఘం ఉత్తర తెలంగాణ ఇంచార్జి : పొలాస నరేందర్
- బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిబా పూలే జయంతి



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ ఇంచార్జ్ పొలాస నరేందర్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొలాస నరేందర్ మాట్లాడుతూ పూలే ఆశయాలను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయాలని, బీసీలకు హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం కల్పించాలని కోరారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లులు ఆమోదించడంతో పాటు, చట్టసభల్లో బీసీలకు మరియు మహిళల్లో బీసీ సబ్‌కోటాకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ దేవతల పట్ల భక్తి

- సంప్రదాయాలు మన సంస్కృతికి ప్రతీక - గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉంటా
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- స్తంభంపల్లిలో ఘనంగా పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** చొప్పదండి నియోజకవర్గం, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ,"గ్రామ దేవతల పట్ల భక్తి, సంప్రదాయాలు మన సంస్కృతికి ప్రతీక. పోచమ్మ తల్లి ఆశీస్సులతో స్తంభంపల్లి గ్రామం సుఖశాంతులతో, సుభిక్షంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను" అని అన్నారు."గ్రామాల్లో ఐక్యతతో పాటు అభివృద్ధి కూడా సమానంగా కొనసాగాలి. స్తంభంపల్లి గ్రామానికి అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు నా వంతు కృషి చేస్తాను. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో స్ఫూర్తినింపిన పూలే జయంతి వేడుకలు

- వేములవాడ గురుకులంలో ఘనంగా జ్యోతిబా పూలే జయంతి సందడి



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉపాధ్యాయులు డాక్టర్ ఒల్లాల శ్రీనివాస్ మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిబా పూలే సమాజంలో సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని వివరించారు. ముఖ్యంగా అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు అమోఘమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఆయన ఆశయాలను అనుసరించి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు రమేష్, ప్రవీణ, శంకర్ బాబు, ఉస్మాన్, వినోద్, భార్గవి, చోలేశ్వర్ చారి, ప్రదీప్, అనిల్, భాగ్యలక్ష్మి, ఫయాజ్, ఎల్లేష్, రామస్వామి, బాలకృష్ణ, రెహానా తదితరులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గ్రామ ప్రజలపై అమ్మవారి కృపా కటాక్షాలు ఉండాలి

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే : సుంకె రవిశంకర్
- స్తంభంపెల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ - మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలో పునర్నిర్మాణం చేసిన పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రైతులు పాడి పంటలతో అభివృద్ధి చెందాలని, అందరికీ ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. గ్రామ ప్రజలపై అమ్మవారి కరుణ ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులను, గ్రామ ప్రజలను ఆయన ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు,బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, మేడుదల మల్లేశం, తుంటి మధు, పెగ్గర్ల శేఖర్, దూస మధు, కార్తీక్, మధు, మనోజ్, దిలీప్, కరుణాకర్, సాగర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజ మార్పు

- సమాజిక న్యాయానికి ప్రతీక పూలే
- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షులు : బత్తిని మహేందర్ యాదవ్
- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పూలే జయంతి వేడుకలు




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక సంస్కర్తగా జ్యోతిరావు పూలే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడని మహేందర్ కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలంటే విద్యే ప్రధాన మార్గమని ఆయన ఆ రోజుల్లోనే చాటి చెప్పారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, దళితులు మరియు బీసీ వర్గాల కోసం తొలి పాఠశాలలు స్థాపించి విద్యా విప్లవానికి నాంది పలికిన వ్యక్తిగా ఆయన నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ తో పాటుగా వేములవాడ టౌన్ యూత్ అధ్యక్షులు బండారి గవాస్కర్,వేములవాడ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మొగిలి కరుణాకర్, అర్బన్ మండల అధ్యక్షుడు పార్వతి మహేష్, బోయినిపల్లి మండల అధ్యక్షుడు దయ్యాల రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కోక్కుల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు వాసం మల్లేశం యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లిరోజు వేడుకలలో భాగంగా ప్రకృతికి ప్రాధ్యాన్యతనిచ్చిన గుంటి లతాశ్రీ - శంకర్ దంపతులు

- గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్ఫూర్తితో ఘనంగా "గుంటి" దంపతుల పెళ్లిరోజు వేడుకలు
- పర్యావరణం పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి
- గుంటి లతాశ్రీ - శంకర్ దంపతులు





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో శనివారం బోయినిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గుంటి లతాశ్రీ, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల అనంతరం తమ ఇంటి ఆవరణలో కొబ్బరి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ రాజ్యసభ సభ్యులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త జోగినిపల్లి సంతోష్ కుమార్ స్ఫూర్తితో ఈ మొక్కను నాటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ జన్మదిన వేడుకలు,వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఒక మొక్కను విధిగా నాటి సంరక్షించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జోగినిపల్లి సంతోష్ కుమార్ పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం హర్షణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మేడుదుల మల్లేశం, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, అక్కెనపల్లి కర్ణాకర్, కన్నం సాగర్, బోయిని రాజు, గురజాల కోటి, తొంటి మధు, సిద్ధు, మనోహర్, మధు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యులు కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారంతో సర్వరోగ నివారణ

- కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత



**కోరుట్ల** సమతుల్య ఆహారంతో సర్వరోగ నివారణ అవుతుం దని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. మహి ళలు,గర్భిణీలు,కిశోర బాలికలు,చిన్నారులకు పోషకాలు ఉన్న సమతుల్య ఆహారం అందిస్తేనే భవిష్య త్తులో రోగాలు దరి చేరవని ఆరోగ్య సంరక్షణకు తీసుకో వాల్సిన కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్,14వ వార్డు కౌన్సిల ర్ రేంజర్ల కళ్యాణి తో కలిసి అవగాహన కల్పించారు. పోష ణ పకోడా లో భాగంగా శని వారం కోరుట్ల పట్టణ 14వ వార్డు భీముని దుబ్బ అంగ న్వాడి కేంద్రంలో పాలిచ్చే తల్లులకు శిశువుల పోషణ పై సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు పరిపూర్ణ అవగాహన కల్పించారు. పోషకాహారం రూపం,కలిగే అన్నదానాలు క్షేత్రస్థాయిలో ప్రజల చైతన్య పరుస్తున్నమ న్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల ఎంతో బరువు చూసి ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసుకుని సప్లిమెంటరీ పోషకాహార నిపుణులు అవగాహన కిషోర్ బాలికలకు రక్తహీనత పరీక్షలు,పోషకాల లోకాన్ని అనుభవించడానికి పిల్లలు గర్భిణీలు,బాలింత లు,కౌమార దశలోని బాలి కలు తీసుకోవాల్సిన అంశాల ను వివరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్,14వ వార్డు కౌన్సిల ర్ రేంజర్ల కళ్యాణి ల చేతుల మీదుగా భక్తుల భవిష్యత్తుకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిడిపిఓ కే.మణెమ్మ, సూపర్వైజర్ ఏ.భారతి, అంగన్వాడి టీచర్ రేంజర్ల రాజమణి,ఆర్ పి బి.లక్ష్మి, ఆశా జ్యోతి,ఆయమ్మ పి. కవిత,మహిళలు,చిన్నా రులు,తదితరులు పాల్గొ న్నారు.

## సామాజిక విప్లవకారుడు, మహిళలకు విద్య కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే



**మేడిపల్లి** సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే అని పలువు రు వక్తలు పేర్కొన్నారు. జగి త్యాల జిల్లా మేడిపల్లి మండలనీ కల్వకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సామాజిక విప్లవకారుడు, మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను శనివా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్య కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయనీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.? ఈకార్యక్రమంలో కల్వకోట గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల రమేష్ , ఉప సర్పంచ్ రవితేజ,వార్డ్ సభ్యులు నవీన్,రాజేష్, న్యాయవాది బొడ్డు నరేష్, సంజీవ్,మోహన్,వెంకటి, నరేష్,గంగాధర్,లహరి, రాజేశ్వరి,(వి.ఓ)శ్యామల వివోఏ జ్యోత్స్న ,కారోబార్ మమత,గ్రామస్తులు పాల్గొ న్నారు.

## పెదనందిపాడు పరిధిలో విషాద ఘటన..!

- స్కూల్ బస్సు కింద పడి నాలుగేళ్ల బాలుడు మృతి..!

**గుంటూరు** పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో శ్రీనివాస అబాఇ స్కూల్కు చెందిన బస్సు కింద పడి యూకేజీ విద్యార్థి చిన్నారి కూచిపూడి కృప అన్వేష్ (4) మృత్యువాత పడ్డాడు. బస్సు వెనుక వైపు ఉన్న అన్వేష్ ను చూసుకోకుండా నిర్లక్ష్యంగా బస్సును డ్రైవర్ రివర్స్ తీసాడు. దీంతో బస్సు వెనుక చక్రాల కింద నలిగిపోయి అన్వేష్ అక్కడికక్కడే కన్నుమూసాడు. పరారీలో ఉన్న డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## మాచర్ల ఏఎస్సై శ్రీనివాసరావు సస్పెండ్..!

**పల్నాడు** ప్రేమజంటల వీడియోలు తీసి, బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఏఎస్సై శ్రీనివాసరావు ను సస్పెండ్ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేసారు. వీడియోలు చూపించి, కోరిక తీర్చాలంటూ మహిళలను ఏఎస్సై శ్రీనివాసరావు వేధిస్తున్నట్లు వీడియలో వైరల్ అయిన సంగతి తెలిసిందే.

## కారు మీద లారీ బోల్తా



**ఎన్టీఆర్** కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పిన లారీ కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. టోల్ ప్లాజా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

# భారీ రేషన్ బియ్యం దందాకు చెక్

## - 1100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత
## - దశాబ్ద పై కాలంగా సాగుతున్న అక్రమ సామ్రాజ్యం.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా, రాయపోల్ మండలం,రామారం గ్రామం లో భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణ జరుగుతుందని "ప్రజా ప్రశ్న" దినపత్రికలో వరుస కథనాలు వెలువడడంతో అధికార యంత్రాంగాన్ని కదిలించాయి. దాంతో దశాబ్ద పై కాలంగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ రేషన్ బియ్యం దందా "ప్రజా ప్రశ్న" దినపత్రిక కథనాలతో బట్టబయలైంది. రామారం గ్రామంలోని శ్రీ సాయి మహాదేవ రైస్ మిల్ పేరుతో నడుస్తున్న ఈ వ్యవహారంపై పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ ఓ ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. సుమారు 1100 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు.

దాడుల సమయంలోనే ఒక వాహనం రైస్ మిల్ ప్రాంగణంలోకి ప్రవేశించగా, అధికారులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఆ వాహనంలో కూడా పీడీఎస్ బియ్యం ఉండటం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మొత్తం వ్యవహారం బచ్చు రత్నాకర్‌కు చెందిన గోదాముగా జిల్లా పౌర సరఫరాల అధికారి తనుజ తెలిపారు. అయితే రేషన్ బియ్యం అక్రమ రవాణ దందా ఒక్కరోజులో ఏర్పడినది కాదని దశాబ్ద పై కాలంగా యదేచ్ఛగా కొనసాగుతోందని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కొంతమంది అధికారులకు, రిపోర్టర్లకు మామూళ్లు చెల్లిస్తూ ఈ అక్రమ వ్యాపారం రత్నాకర్ నిర్భయంగా నడిపించాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఎవరైనా ఈ వ్యవహారంపై ప్రశ్నిస్తే అధికార పార్టీ పేరు చెప్పి వారిని బెదిరింపులకు గురి చేసిన ఘటనలు కూడా చాలా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ప్రధాన నిందితుడు రత్నాకర్ పరారీలో ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఇదే వ్యక్తిపై గతంలో కూడా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా ఇలాంటి అక్రమాల కారణంగానే ఈ రైస్ మిల్లును గతంలోనే ధాన్యం కొనుగోలు (ప్రొక్యూర్మెంట్




మరియు కస్టమ్ మిల్లింగ్) కార్యకలాపాల నుంచి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చినట్టు అధికారు వెల్లడించారు. అయిన కూడా ఇంత భారీ స్థాయిలో మళ్లీ రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగడంపై అధికారుల నిర్లక్ష్యం ఉందా.? లేక మామూళ్ల వ్యవహారమా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్వాధీనం చేసుకున్న 1100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పంచనామా నిర్వహించి, భద్రపరిచేందుకు తొగుట, మిరుదొడ్డి ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించారు. ఈ ఘటనపై రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో పాటు, నిత్యవసర వస్తువుల చట్టం-1955 కింద 6(ఏ) సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకున్నారు. అలాగే తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్-2016, తెలంగాణ కస్టమ్ మిల్లింగ్ ఆర్డర్-2015 ఉల్లంఘనలపై కూడా కేసులు నమోదు చేశారు. ఇప్పటికే అనేక కేసులు ఎదుర్కొంటున్న రత్నాకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, పీడీ యాక్ట్ అమలు చేయాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ పాండరి, జిల్లా పౌర సంబంధాల అధికారి తనుజ, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎస్ఐ కుంచం మానస తదితరులు పాల్గొన్నారు. ఇంతకాలం ఈ అక్రమ దందా అధికారుల ఎవరి కళ్లకు కనిపించలేదా.? లేక




లంచాలు తీసుకొని చూసి చూడనట్టు వదిలేశారా.?




# హర్మూజ్ జలసంధిని క్లియర్ చేస్తున్నాం

## - ట్రంప్ కీలక ప్రకటన




న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా అమెరికాకు చెందిన రెండు యుద్ధనౌకలు హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించాయి. ఈ కీలకమైన జలమార్గాన్ని క్లియర్ చేసే ప్రక్రియను ప్రారంభించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన ఈ ఘర్షణ నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా నేవీకి చెందిన గైడెడ్-మిస్సైల్ డిస్ట్రాయర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జలసంధిని దాటినట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. అయితే, ఈ ఆపరేషన్ కోసం టెహ్రాన్ అధికారులతో ఎలాంటి సమన్వయం చేసుకోలేదని యాక్సియోస్ అనే మరో మీడియా సంస్థ తెలిపింది. ఈ అంశంపై తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ట్రంప్ స్పందించారు. "మేము ఇప్పుడు హర్మూజ్ జలసంధిని క్లియర్ చేసే ప్రక్రియను ప్రారంభిస్తున్నాం" అని ఆయన తెలిపారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలకు ఇది మేలు చేస్తుందని, ఆ దేశాలకు ఈ పని చేసే ధైర్యం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘర్షణలో ఇరాన్ భారీగా నష్టపోతోందని ట్రంప్ అన్నారు. అయితే, ఇరాన్ సముద్రంలో అమర్చిన మైన్‌ల వల్ల ఇప్పటికీ ప్రమాదం పొంచి ఉందని అంగీకరించారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇరాన్ ఈ కీలక జలమార్గాన్ని దాదాపుగా దిగ్బంధించింది. ప్రపంచంలోని ముడిచమురు రవాణాలో ఐదో వంతు ఈ మార్గం గుండానే జరుగుతుంది. ఇదిలా ఉంటే ఈ ఘర్షణకు ముగింపు పలికేందుకు ఇరు దేశాల సీనియర్ అధికారులు పాకిస్థాన్‌లో నేడు చర్చలు ప్రారంభించినట్టు ఇరాన్ మీడియా వెల్లడించింది.

# జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

## - జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఖరారు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జగిత్యాలలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కోసం గులాబీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నాయి. సుమారు లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభకు సంబంధించి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు ఈరోజు పార్టీ ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వసంత తదితరులు కలిసి జగిత్యాలలోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానం, ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని కాలేజీ గ్రౌండ్, మోతే రోడ్డు ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఈ బహిరంగ సభకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడటానికి ప్రధాన కారణం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో మాజీ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా పార్టీలో చేరనుండటమే. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చితే ఈ రెండేళ్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భారీ సభ ద్వారా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును మరోసారి నిరూపించుకోవాలని భావిస్తోంది.




# మేడ్చల్ మత్తు సామ్రాజ్యం

- గంజాయి కోరల్లో చిక్కుకున్న భవిష్యత్తు
- సరిహద్దులు దాటుతున్న చావు దందా
- టార్గెట్ కాలేజీ కుర్రాళ్లు, యువత
- పోలీసుల నిఘా కళ్లు కప్పి.. సరికొత్త పంథాలు
- తల్లిదండ్రుల ఆక్రందన.. మేల్కొనేది ఎప్పుడు.?
- 50 నుంచి 60 కిలోల గంజాయి పట్టివేత






మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) అది చదువుల నిలయం కావాల్సిన చోటు.. కానీ మత్తు నిలయంగా మారుతోంది. ప్రశాంతంగా ఉండాల్సిన గ్రామాలు గంజాయి గుప్పుమనే వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి మాఫియా పడగ విప్పుతోంది. పక్క రాష్ట్రాల నుండి నరకపు లోకానికి రహదారి నిర్మిస్తూ, మన కళ్ల ముందే ఒక తరాన్ని నాశనం చేస్తోంది.

### సరిహద్దులు దాటుతున్న చావు దందా..

రాష్ట్ర సరిహద్దుల నుండి మేడ్చల్ మండలంలోకి గంజాయి వరదలా పారుతోంది. పోలీసులు అడపాదడపా పట్టుకుంటున్న తీగలు మాత్రమే.. డొంకంతా ఇంకా బయటే ఉంది. ఈజీ మనీ అనే రక్తదాహంతో ఉన్న కొందరు కేటుగాళ్లు, పసి ప్రాణాలను పణంగా పెట్టి ఈ మత్తు వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

### టార్గెట్ కాలేజీ కుర్రాళ్లు, యువత..

ఈ మాఫియా కన్ను రేపటి పౌరులపై పడింది. విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని ముఠాలు వ్యూహాలు పన్నుతున్నాయి. మొబైల్ యాప్‌లు, ప్రత్యేక కోడ్ భాషలతో పోలీసులకు అందకుండా ఆర్డర్లు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఆకర్షణీయమైన పద్ధతుల్లో మత్తును రుచి చూపిస్తూ వారిని బానిసలుగా మార్చుకుంటున్నారు. ఫలితంగా.. ఉజ్వల భవిష్యత్తు ఉండాల్సిన యువత, మత్తులో తూలుతూ నేరాలకు పాల్పడుతోంది. కన్నవారి కడుపు కోత మిగిలిస్తూ అకాల మరణాల పాలవుతోంది.

### పోలీసుల నిఘా కళ్లు కప్పి.. సరికొత్త పంథాలు..

పోలీసులు నిఘా పెంచినా, మాఫియా తన రూటు మారుస్తోంది. నిత్యావసర సరుకుల వాహనాల్లో, పండ్ల బుట్టల వాహనాలను సైతం వదలకుండా గంజాయిని తరలిస్తున్నారు. పట్టుబడిన వారు కేవలం కూలీలే.. అసలు తిమింగలాలు ఏసీ గదుల్లో కూర్చుని ఈ మత్తు సామ్రాజ్యాన్ని శాసిస్తున్నాయి అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తల్లిదండ్రుల ఆక్రందన.. మేల్కొనేది ఎప్పుడు.?

మా పిల్లలు మత్తుకు బానిసై కళ్ల ముందే కరిగిపోతున్నారంటు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారుల ప్రకటనలు కాగితాలకే పరిమితం కాకుండా, గంజాయి నెట్వర్క్‌పై సర్జికల్ స్ట్రైక్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మేడ్చల్ గడ్డపై గంజాయి వాసన పోవాలి. పోలీసు యంత్రాంగం, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో ఉక్కుపాదం మోపకపోతే, మేడ్చల్ మరో 'మత్తు అడ్డా'గా మారడం ఖాయం.

### 50 నుంచి 60 కిలోల గంజాయి పట్టుకున్న ఎస్ఓటి పోలీసులు

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ పై ఎస్ఓటి పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. విశ్వాసనీయ సమాచారం మేరకు శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించగా అనుమానవస్పదంగా వెళ్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు 50 నుంచి 60 కిలోల వరకు ఉంటుంది. నిందితులను అదుపులోకి తీసుకొని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు.

# సప్లై ఉన్నా.. సరఫరా సున్నా

- మైసిరెడ్డిపల్లిలో గ్యాస్ కష్టాలు
- మండిపడుతున్న మహిళలు
- నెల రోజులుగా నిరీక్షణ.. తీరని అవస్థలు
- ఖాళీ సిలిండర్లతో నిరసన
- గ్రేటర్ హైదరాబాద్ లో భారీగా గ్యాస్ సిలిండర్ల దందా
- డీలర్లే అక్రమ దందాకు పాల్పడుతున్నారని ఆరోపణలు





మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ఒకవైపు ధరల భారంతో సామాన్యుడి నడ్డి విరుగుతుంటే, మరోవైపు గ్యాస్ ఏజెన్సీల నిర్లక్ష్యం ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. మేడ్చల్ మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామంలో గత నెల రోజులుగా వంట గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో సామాన్యుల ఇళ్లలో పొయ్యి వెలగడం లేదు. మేడ్చల్ భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరుపై గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నెల రోజులుగా నిరీక్షణ.. తీరని అవస్థలు

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, గ్యాస్ సిలిండర్ల కోసం బుకింగ్ చేసుకుని నెల రోజులు గడుస్తున్నా, ఏజెన్సీ నుండి ఉలుకూ పలుకూ లేదు. భారత్ గ్యాస్ ఏజెన్సీకి ఎన్నిసార్లు విన్నవించినా కాలయాపన చేస్తున్నారే తప్ప సరఫరా చేయడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి సమీపంలోనే ఉన్నా మైసిరెడ్డిపల్లి గ్రామాన్ని ఏజెన్సీ నిర్వాహకులు చిన్నచూపు చూస్తున్నారని వారు మండిపడుతున్నారు.

### ఖాళీ సిలిండర్లతో నిరసన..

శనివారం గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద మహిళలు ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. నెల రోజులుగా గ్యాస్ రాక వంట చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలకు సమయానికి భోజనం పెట్టలేకపోతున్నాం. అని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### గ్యాస్ సిలిండర్ ఇవ్వకుంటే ధర్నా చేస్తాం

గ్యాస్ ఏజెన్సీ తన పద్ధతి మార్చుకోకపోతే సహించేది లేదని గ్రామ మహిళలు హెచ్చరించారు. వెంటనే గ్రామానికి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలి. ఒకవేళ నేడు గ్యాస్ వాహనం గ్రామానికి రాకపోతే, ఏజెన్సీ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపడతామని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్యాస్ సకాలంలో సరఫరా చేయని భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588